

కెపిహెచ్‌బి రమ్యగ్రౌండ్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేనపార్టీ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వ హించారు.

## ముగ్గుల పోటీలు

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 6, ప్రభాతవార్త : కెపిహెచ్‌బి రమ్యగ్రౌండ్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేనపార్టీ ఆధ్వర్యంలో శనివారం ముగ్గల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ హిళలు ఉదయం పూట ఇళ్ళముందు ముగ్గులు వేయడం మంచి వ్యాయామమన్నారు.

మిగతా తరువాయి పేజీలో



హైదరాబాద్ వార్త

గ్రానైట్ బండలు మీదపడి

## ఇద్దరు వ్యక్తులు మృతి

పేట్‌బషీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త: లారీలో వచ్చిన గ్రానైట్ బండలు కిందకు దింపే క్రమంలో ప్రమాదవశాత్తు మీదపడి ఇద్దరు వలస కూలీలు మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన సీతాచరన్ (36), జార్కండ్‌కు చెందిన లకన్ (25)లు గత కొంతకాలంగా బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటున్నారు. కొంపల్లిలో నిర్మాణ దశలో ఉన్న త్రిబుల్ ఆర్ అపార్ట్‌మెంట్‌లో లేబర్ పనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. శనివారం ఉదయం మహారాష్ట్ర నుండి కొంపల్లిలో ఉన్న అపార్ట్ మెంట్‌లో కావాల్సిన గ్రానైట్ బండలను దింపేందుకు సీతాచరన్, లకన్‌లు సిద్ధమయ్యారు. దీంతో లారీలో ఉన్న గ్రానైట్ బండల మధ్యలో ఉన్న కర్రను తీసివేయగా బండలు ఒక్కసారిగా వారిమీద పడ్డాయి. అక్కడే ఉన్న మిగతా కూలీలు అప్రమత్తమై స్థానికులు, పోలీసులు వారిని బయటకు తీసి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పేట్ బసీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా పనులపై తగిన నైపుణ్యం లేకపోవడంతో పాఉట ఎలాంటి సేఫ్టి ప్రికాషన్స్ లేకుండా అమాయకులైన కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న భవన నిర్మాణ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## వీసా ఇప్పిస్తానంటూ రూ3.45లక్షల వసూలు

**కన్సల్టెన్సీ నిర్వాహకులపై పోలీసుల కేసు నమోదు**

బేగంపేట జనవరి 6,ప్రభాతవార్త: వీసా ఇప్పిస్తానంటూ మాయమాటలు చెప్పి బాధితుల వద్ద నుంచి 3.45లక్షలు వసూలు చేసిన కేసులో ఓ కన్సల్టెన్సీపై పోలీసులు కేసు నమోదు చేసారు.బేగంపేట పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.నిజామాబాద్ జిల్లా దర్పల్లికి చెందిన పి.గోపాలకృష్ణ ,వరంగల్‌కు చెందిన పి.కాశీనాథ్‌లు కెనడా దేశం వెళ్లేందుకు గత సంవత్సరం బేగంపేట లోని అబ్రాడ్ గేట్ వే కన్సల్టెన్సీని సంప్రదించారు.వీసా ఇప్పిస్తామంటూ వారిని నమ్మించిన నిర్వహకులు దీపిక,కార్తీక్,ఎండీ పాషా,సోహెల్‌లు గోపాలకృష్ణ నుంచి రూ 1.65,000లు కాశీనాథ్ నుంచి రూ 1,80,000లు వసూలు చేసారు.వీసా కోసం కన్సల్టెన్సీ నిర్వహకులు కెనడా ఎంబసీలో నకిలీ పత్రాలను సమర్పించడంతో వీసాను అధికారులు తిరస్కరించారు.దీంతో బాధితులు ఇద్దరూ తమ డబ్బు తమకు చెల్లించాలని చాలా సార్లు కన్సల్టెన్సీని సంప్రదించినప్పటికీ నిర్వహకులు పట్టించుకోకుండా వారిని లెక్క చేయలేదు.ఇదే సమయంలో వారు పరుషమైన పదజాలంతో దూషించడమే కాకుండా దురుసుగా కూడా ప్రవర్తించారన్నారు.దీంతో బాధితులు శుక్రవారం సాయంత్రం బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కన్సల్టెన్సీ నిర్వహకులపై కేసు నమోదు చేసారు.కేసును ఎస్సై ఆర్ జయచందర్ దర్యాప్తు చేస్తున్నారు.

## అభయహస్తం దరఖాస్తుల కంప్యూటరీకరణ



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో అభయహస్తం దరఖాస్తులను కంప్యూటరీకరణ చేస్తున్న సిబ్బంది

నార్సింగి, జనవరి 6 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో అభయ హస్తం దరఖాస్తులను కంప్యూటరీకరణ చేస్తున్నామని కమీషనర్ శరత్‌చంద్ర తెలిపారు. కార్పోరేషన్ పరిధిలో మొత్తం 34,236 ఇళ్లు ఉండగా ఆరో తేదీ సాయంత్రం వరకు 19,366.మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ దరఖాస్తు ఫారాలలోని డాటాను కంప్యూటరీకరణ చేస్తున్నామని కమీషనర్ తెలిపారు.

## పాండు రంగానగర్‌లో 20 తులాల బంగారం దొంగతనం

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 6 ప్రభాతవార్త : ఇంట్లోని బీరువాలో దాచిన 20 తులాల బంగారం ఆభరణాలు మాయమైన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం.. పాండు రంగా నగర్‌కు చెందిన అశోక్ దిదాధరి (41) ప్రైవేట్ ఉద్యోగి.ఈ నెల ఐదవ తేదీ సాయంత్రం అశోక్ దిదాధరి కుటుంబ సభ్యులు ఇంటికి సంబంధించిన తాళాలను ఇంట్లో అద్దెకు ఉంటున్న వారికి ఇచ్చి స్కూల్ నుంచి పిల్లలను తీసుకు రావటానికి వెళ్లారు.శనివారం బీరువా తెరిచి చూడగా అందులో ఉంచిన 20 తులాల బంగారం ఆభరణాలు కనిపించలేదు.దీంతో అశోక్ దిధాదరి బీరువాలోని బంగారం ఆభరణాలు కనిపించటం లేదంటూ అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళా జూనియర్ కళాశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులు



తనిఖీలు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్

దుండిగల్, జనవరి 6 ప్రభాతవార్త: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేటలోని ఓ మహిళా జూనియర్ కళాశాలలో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైయ్యారు. కళాశాలలో మొత్తంగా 1500 మంది విద్యార్థులు ఉండగా శనివారం ఉదయం కలుషిత ఆహారం, తాగునీటి సమస్య వలన 50కిపైగా విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన స్థానికంగా ఉన్న ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉండడంతో ఒక్కొక్కరిని సంక్రాంతి సెలవుల పేరుతో ఇళ్ళకు పంపిస్తున్నారు. ఓవైపు సప్లిమెంటరీ పరీక్షలు ఉండగా 10రోజుల ముందే సెలవుల అంటూ తరలిస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై కళాశాల ఏజిఎం ప్రసాద్‌ను వివరణ కోరగా వాతా వరణ సమస్య కారణంగా కొందరూ విద్యార్థులు అస్వస్థతకు గురైంది నిజమేనన్నారు. విద్యార్థులు ఆందోళన చెందకుండా సంక్రాంతి సెలవులకు ఇళ్ళకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు సంక్రాంతి సెలవుల అనంతరం నిర్వహిస్తామన్నారు. సమాచారం అందుకున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్ కళాశాలకు చేరుకొని వంటగదిని, ఆహారాన్ని పరిశీలించి శాంపిల్స్ సేకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించాము వాటి రిపోర్ట్స్ ఆధారంగా చర్యలు చేపడుతామన్నారు.

# గడువు ముగిసింది

## మళ్లీ నాలుగు నెలల తర్వాతే..

- **ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ గడువు**
- **గ్రేటర్ మూడు జిల్లాల నుంచి 24, 74, 325 దరఖాస్తులు**
- **కొత్త రేషన్ కార్డుకోసం 5 లక్షలు 73వేలు 69**
- **డేటా ఎంట్రీ చర్యలు చేపట్టిన అధికారులు**
- **ఈనెల 17లోపు పూర్తయ్యేలా ప్రణాళికలు**



హైదరాబాద్, జనవరి 6,ప్రభాతవార్త: ఆరుగ్యారంటీల పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. డిసెంబర్ 28నుంచి జనవరి 6వరకు ఈక్రియ కొనసాగగా గ్రేటర్ పరిధిలో అభయహస్తం కొరకు 24,74, 325 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అందులో ఐదు గ్యారంటీల కోసం 19లక్షల ఒక వెయ్యి రెండువందల యాభై ఆరు రాగా కొత్త రేషన్‌కార్డు కోసం మరో 5లక్షల 73వేల 69 దరఖాస్తులు వచ్చాయి. గతపదిరోజులుగా గ్రేటర్ పరిధిలోని 150వార్డులలో 600ప్రాంతాదల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసిన అధికాకారులు ప్రజలనుంచి ఆర్జీలు స్వీకరించారు. ఆరుగ్యా రెంటీల పథకాలతోపాటు కొత్తరేషన్‌కార్డుకు సైతం దరఖాస్తులు స్వీకరించారు. అయితే ప్రారంభమైన మొదటిరెండు రోజులు దర ఖాస్తు దారులతో కేంద్రాలన్నీ కిటలాడినప్పటికీ ఆతర్వాత క్రమక్ర మంగా తగ్గుముఖం పట్టింది. గ్రేటర్ పరిధిలో సుమారు 40 లక్షలకుపైనే కుటుంబాలు ఉన్నట్లు పలు సర్వే గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందులో ఆదాయం వర్గాలకు సంబంధించిన 10లక్షలు మినహా మిగిలిన 30లక్షల కుటుంబాలు పేద,మధ్యతరగతి కుటుంబాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఆరుగ్యారెంటీల పథకాల్లో మహాలక్ష్మీ, పథకం కింద మహిళలకు నెలకు 2500, రూ.500 వంటగ్యాస్ రాయితీ, గృహలక్ష్మీ కింద 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ వంటి వాటికి జనం పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారు.

**మళ్ళీ నాలుగు నెలల తర్వాత..**

మొదటిదశలో దరఖాస్తు చేసుకోని కుటుంబాలు రెండోసారి జరిగే కార్యక్రమంలో ఆర్జీలు సమర్పించే అవకాశం ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. ప్రతినాలుగు నెలలకోసారి, ప్రజాపాలన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో మరోనాలుగు నెలల తర్వాత రెండోదశ కార్యక్రమం కొనసాగనుంది. కాగా మొదటివిడత ప్రజాపాలన భాగంగా స్వీకరించిన అభయహస్తం దరఖాస్తుల డాటా ఎంట్రీల ప్రక్రియ అధికారులు ప్రారంభించారు. ఈనెల 17వ తేదీవరకు పూర్తి చేవిధంగా చర్యలు చేపట్టారు. జిహెచ్‌ఎంసి, రెవెన్యూ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో డాటా ఎంట్రీ ప్రక్రియ కొనసాగనుంది. డాటా ఎంట్రీల్లో దరఖాస్తు దారుల వివరాల నమోదు లో ఆధార్ నెంబర్, తెల్లరేషన్‌కార్డులను ప్రామాణికంగా తీసుకోనున్నట్లు తెలుస్తుంది. అయితే ఆధారుకార్డుల్లో మార్పుల వల్లనో.. లేదా స్థానికంగా అందుబాటులో లేకపోవడం వల్లో చాలామంది ప్రజాపాలన దరఖాస్తులు ఇవ్వలేకపోయారు. అయితే అలాంటి వాళ్ల తమకు పథకాలు వర్తించవేమోనని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గడువు ముగిసినా ఎమ్మార్వో, ఎంపిడివో కార్యాలయాల్లో అప్లికేషన్లు స్వీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.

## శ్రీరాముడిని చూసి నేర్చుకోవాలి

**చదువు వినయాన్ని ధర్మాన్ని నేర్పేవిదంగా కొనసాగాలి : త్రిదండి చిన జీయర్ స్వామి**

**అంగరంగ వైభవంగా శ్రీసీతారామ చంద్రస్వామి కళ్యాణ మహోత్సవ వేడుక**



డీపీఎస్ ఆవరణంలో శ్రీరాముడి కళ్యాణ మహోత్సవ వేడుకలో మాట్లాడుతున్న త్రిదండి చిన్న జీయర్ స్వామి, చిత్రంలో మల్కాకొమురయ్య

నాచారం, జనవరి 6 ప్రభాతవార్త: చదువు వినయాన్ని ధర్మాన్ని నేర్పేవిదంగా కొనసాగాలని అది శ్రీరాముడిని చూసి నేర్చోకోవాలని శ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన జీయర్ స్వామి పేర్కొన్నారు. నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఢీపీఎస్,పల్లివి విధ్యాసంస్థల ఛైర్మన్ మల్కా కొమురయ్య ఆద్వర్యంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి కళ్యాణ మహోత్సవ వేడుక చిన జీయర్ స్వామి పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల చాలా పవిత్రమైందని ఎందుకంటే ఐదు వందల సంవత్సరాల తరువాత రాముడు తన స్థానానికి చేరుకోబోతున్నాడని చెప్పారు. భారతీయులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న కల సాకారమైందన్నారు. శ్రీరాముడి ఆశీస్సులు డీపీఎస్, పల్లవి స్కూల్ విధ్యార్థులపై ఎల్లప్పుడు ఉండాలని ఇంత గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఛైర్మన్ కొమురయ్యదంపతులు ధన్యులన్నారు. ఈ సందర్భంగా ఆయన రాముడి గుణగణాల నుంచి రామాయణంలోని ప్రముఖ ఘట్టాలను సవివరంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి,నాచారం ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్ రెడ్డి, డీపీఎస్ సీఈఓ మల్కా యశస్వి పాల్గొన్నారు. సుమారు 12 వేల మంది ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు.హాజరైన వారికి అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను అందజేశారు.

## రేపు నిరుద్యోగులకు శిక్షణ

ఘట్‌కేసర్, జనవరి 6, ప్రభాతవార్త: ఈనెల 8న ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించేందుకు ఎంపికలు నిర్వహిస్తున్నారని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ-హాస్టల్-బోజన వసతితో పాటు ఉద్యోగం కల్పిస్తారని తెలిపారు.

## మంగళంపల్లి బాలమురళీకృష్ణ గానం నేటికీ నిత్య నూతనం

**ప్రముఖ గాయకుడు త్రినాథరావు**



గాయకులను సత్కరిస్తున్న ప్రముఖులు

ముషీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త: మంగళంపల్లి బాలమురళీ కృష్ణ గానం లోని మాధుర్యం నేటికీ నిత్యనూతనమై శ్రోతలను రంజింపచేస్తోందని ప్రముఖ గాయకులు త్రినాథ రావు కొనియాడారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు వేదికపై బుక్ రీడింగ్ అండ్ కల్చరల్ సొసైటీ, శ్రీరాగ సినీ మ్యూజికల్ ఆర్కెస్ట్రా 25 సంవత్సరాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకుడు, రచయిత డీవీవీఎస్ నారాయణ సంకలనం చేసిన సంగీత స్వరనిధి బాలమురళీకృష్ణ సంపుటిని త్రినాథరావు విశ్రాంత విద్యాధికారి పల్లా సోమ సుందరశర్మ, అన్నమయ్య సంకీర్తనల పరిశోధకుడు నాగరాజులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ అత్యుత్తమ పురస్కారం పద్మవిభూషన్ పొందిన బాల మురళీ కృష్ణ తన నాలుగవ ఏటనే సంగీత కచేరి చేశారని గుర్తు చేశారు. డీవీవీఎస్ నారాయణ చేసిన సంకలనంలో ప్రముఖులు రాసిన పలు వ్యాసాలు బాల మురళీకృష్ణ గురించి తెలుసుకునేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం అణు శాస్త్రవేత్త విశ్వనాథ్ మద్దిపట్లను కళావాచస్పతి బిరుదుతో, రక్షణశాఖలో పదవీ విరమణ చేసిన ఆదినారాయణమూర్తిని జీవిత సాఫల్యపురస్కారంతో, గాయని వీఏ లక్ష్మిని గాన సుధారత్న బిరుదుతో, గాయకుడు నేదునూరి శ్యామకృష్ణను గాన కళాభూషణ బిరుదుతో సంస్థ పక్షాన సత్కరించారు. విశ్వనాథ్ కేవలం అణుశాస్త్ర నిపుణులు మాత్రమే కాదని, ఆయన సినీ పాటలపై గొప్ప పరిజ్ఞానం ఉన్న గాయకుడని అభినందించారు. సంస్థ కార్యదర్శి అలివేలు నివేదికను సమర్పించగా లక్ష్మి, శ్యామ, కృష్ణ, శ్రీదేవి గానాలాపాన చేసి శ్రోతలను అలరించారు.



భాగ్యలక్ష్మీ మందిరం పూజలు నిర్వహించిన కైలాష్ మఠం భక్తి ధామం ట్రస్ట్ శ్రీ స్వామి సమ్‌విదానంనద్ సరస్వతి జీ,పండిత్ విశేష్ శర్మ

## భాగ్యలక్ష్మి మందిరంలో పూజలు

చార్మినార్, జనవరి 6 ప్రభాతవార్త : చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరాన్ని శనివారం కైలాష్ మఠం ట్రస్ట్ భక్తి ధామం,నాసిక్ శ్రీ స్వామి సమ్‌విదానంనద్ సరస్వతి జీ సందర్శించారు.సమ్‌విదానంద్ సరస్వతిజీతో పాటు పండిత్ విశేష్ శర్మలు శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మవారికి పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.మందిరం కమిటి ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజా పాలన ధరఖాస్తులను పరిశీలించి

## ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

**మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్**

శామీర్‌పేట, జనవరి 6, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో అందిన ధరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. శనివారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ కార్యాలయంను కలెక్టర్ సందర్శించి ప్రజా పాలన కార్యక్రమం చివరి రోజున సందర్శించి అందిన ధరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయటాన్ని కూడ ప్రత్యేకంగ పరిశీలించారు. దీనిలో కలెక్టర్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య కూడ పాల్గొన్నారు. ప్రజా పాలనలో వచ్చిన ధరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను కలెక్టర్ గౌతమ్ డాటా ఎంట్రీ ఆపరేటర్ల వద్ద ఉండి ప్రత్యేకంగ పరిశీలించారు. ప్రజలు ధరఖాస్తులను తీసుకవచ్చి ఎలా నింపారు. ఎలాంటి పత్రాలు జత చేశారు. వాటి వివరాలను కూడ అక్కడ ప్రజలను అడిగి తెలుసుకుని ప్రభుత్వం ద్వారా అర్హులైన లబ్దిదారులకు వచ్చె ఆరుపథకాల గురించి వివరించారు. ఆ తరువాత ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో గ్రామపంచాయతీలు, మున్సిపాల్టీలలో నిర్వహిస్తున్న సభలలో వచ్చిన ప్రతి ధరఖాస్తులను క్షుణ్ణంగ పరిశీలించి వివరాలను జాగ్రత్తగ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. గత డిసెంబరు 28నుంచి ఈ నెల 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజా పాలనలో వచ్చిన ధరఖాస్తులకు సంబంధించి డాటా ఎంట్రీ ఆపరేటర్లు పరిశీలించి పూర్తి సమాచారాన్ని జాగ్రత్తగ నమోదు చేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. ధరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండ జాగ్రత్తగ, అప్రమత్తంగ ఉండాలని అన్నారు. ప్రజా పాలనలో ధరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మొబైల్‌నెంబర్లతో పాటు ధరఖాస్తుదారులు నింపిన సమాచారాన్ని ఆపరేటర్లు ఎంట్రీ చేసి అప్లోడ్ చేయాలని వివరించారు. ఈ ధరఖాస్తులు ఈ నెల 6వ తేదీ నుంచి 17వ తేదీలోగా దరఖాస్తులను వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. అభయ హస్తం కింద ధరఖాస్తులను ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగ షిఫ్టుల్లో ప్రతి రోజు ఆపరేటర్ డేటాను ఎంట్రీ చేయాల్సి ఉంటుందని, ఎంట్రీ చేసే సమయంలో ఎలాంటి తప్పులు లేకుండ చూడాలని ప్రతి ధరఖాస్తు ఫారం ఆన్‌లైన్‌లో తప్పకుండ నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య, ఉన్నారు.

## అతివేగంతో డివైడర్ ఢీకొట్టిన కారు

**బెలూన్స్ ఓపెన్ ★ తప్పిన ముప్పు**




బేగంపేట ఫ్లై ఓవర్ పైన ప్రమాదానికి గురైన కారు

బేగంపేట జనవరి 6,ప్రభాతవార్త : బేగంపేట నుంచి శనివారం తెల్లవారు ఝామున బేగంపేట వైపు నుంచి పంజాగుట్టవైపు వెళుతున్న కారు వేగంగా వెళ్లి బేగంపేట ఫ్లై ఓవర్ మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొంది.ఈ ఘటనలో కారులో ఉన్న బెలూన్స్ తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న వారు ప్రాణాలతో బయట పడ్డారు.ఈ సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. బేగంపేట మెథడిస్ట్ కాలనీ,కుందన్ బాగ్ కు చెందిన వి.శ్రీనివాస్ తనతో పాటు ఎస్.శివ,వంశీలతో కల్సి టీఎస్ 08 హెచ్‌కే 7941 నెంబరు గల కారులో బేగంపేట నుంచి పంజాగుట్ట వైపు వెళుతున్నారు. తెల్లవారు ఝామున గం 4.15నిలకు బేగంపేట ఫ్లై ఓవర్ మధ్యలో ఉన్న డివైడర్ ను వీరు ప్రయాణిస్తున్న కారు వేగంగా ఢీకొంది.ఈ సమయంలో కారులో ఉన్న బెలూన్లు ఓపెన్ అయ్యాయి.దీంతో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఇదే సమయంలో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు ప్రమాదాన్ని గమనించి వెంటనే గం 4.30 నిలకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రాత్రి విధులు నిర్వర్తిస్తున్న బోయిన్‌పల్లి ఎస్సై రాజు,బేగంపేట ఏఎస్సై పి.సత్యనారాయణ ఆ ప్రాంతానికి చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.కారును అక్కడి నుంచి తొలగించి బేగంపేట పోలీస్‌స్టేషన్ కు చేర్చారు. వేగంగా కారు నడిపిన వి.శ్రీనివాస్‌పైన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**బేగంపేట ఫ్లై ఓవర్ పైన ప్రమాదకరంగా మారిన డివైడర్**

బేగంపేట ఫ్లై ఓవర్ పైన రోడ్డు మధ్యలో తక్కువ ఎత్తులో రెండు రోడ్లు విడిపోయే ప్రాంతంలో ఉన్న చిన్న డివైడర్ వాహనదారులకు ప్రాణాంతకంగా మారింది.గతంలో మరీ తక్కువ ఎత్తు ఉండటం, దీన్ని గుర్తించలేని వాహనదారులు దాని (డివైడర్) మీదకు వాహనాలను పోనిచ్చి ప్రమాదాలకు గురయ్యారు.ఆ తరువాత ఇక్కడ ప్రమాదాలకు కారణమైన ఈ డివైడర్‌ను కొంత ఎత్తు పెంచారు. అయినప్పటికీ ప్రమాదాలను నివారించలేకపోతున్నారు.ఎత్తు పెంచిన తరువాత కూడా వేగంగా వెళుతున్న వాహనదారులు దగ్గరకు వచ్చేదాకా దాన్ని గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు.అయితే ఇది సరిహద్దు (బేగంపేట, పంజాగుట్ట) పోలీస్‌స్టేషన్ల మధ్య సరిహద్దులో ఉండటంతో పోలీసులు ఇక్కడ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ అధికారులైన (ఇక్కడ నుంచి కుడివైపుకు వెళ్లండి అనే కుడి చేయి చూపించే) పోలీసు బొమ్మ ను ఏర్పాటు చేసినట్లైతే ప్రమాదాలు కొంతమేరకైనా నివారించే వీలుంటుందని వాహనదారులు అధికారులను కోరుతున్నారు.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి : మాజీ మంత్రి సర్వే



కంటోన్మెంట్‌లో ప్రజా పాలన కేంద్రాలను సందర్శించిన కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్య నారాయణ తదితరులు

అడ్డగుట్ట, జనవరి 6 ప్రభాతవార్త: కేంద్రంలో,రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్య నారాయణ తెలిపారు. శనివారం కంటోన్మెంట్ నియోజకవర్గం రెజిమెంటల్ బజార్,మారేడ్‌పల్లి నెహ్రూ పార్కు, బోయిన్‌పల్లి, సంజీవయ్య నగర్, అన్నానగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్రజా పాలన కేంద్రాలను అయన సందర్శించారు. ఈ సందర్భంగా సర్వే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన ఘనత సోనియా గాంధీకే దక్కిందన్నారు. రాష్ట్రంలో,కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన అభయ హస్తం పథకాలను ఍సద్వినియోగం చేసుకునేందుకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు శ్యామ్‌సన్ రాజు, బద్ధం బల్వంత్ రెడ్డి, నందికంటి రవి, అర్.డి.నాగేశ్ యాదవ్, డి.బాబురావు, రసీద్, జూడ్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందేలా చేయాలి : ఎమ్మెల్యే లాస్య



రెజిమెంటల్ బజార్‌లో ప్రజా పాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లాస్య నందిత తదితరులు

కంటోన్మెంట్, జనవరి6 ప్రభాతవార్త: ప్రభుత్వం విడుదల చేసిన 6 గ్యారంటీల పథకాలు సకాలంలో అమలైయ్యేలా చర్యలు తీసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత విజ్ఞప్తి చేశారు. శనివారం నియోజకవర్గం 150 డివిజన్ పరికి బస్తీ, డొక్క లమ్మ టెంపుల్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాలను పరిశీలించారు. దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వారందరికి సిబ్బంది సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నివేదిత, దాసరి కర్ణకుమార్, అజయ్, మాధురి, సాయిప్రసాద్, గోపాల్, శేఖర్ ముదిరాజ్, భవానీ, అనీత తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్మీడియట్ గురుకుల జూనియర్ కళాశాలలో
## చేరేందుకు ఈ నెల 15 లోపు దరఖాస్తు చేసుకోవాలి : వినోల

కంటోన్మెంట్, జనవరి 6 ప్రభాతవార్త: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర సిఒఈ లో 2024-25 విద్యా సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 15వ తేదీలోపల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మహేంద్రహిల్స్ గురుకుల బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వినోల తెలిపారు. శనివారం మహేంద్రహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తైన విద్యార్థులు మహేంద్రహిల్స్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో ఎంపిసీ, బైపీసీ ఎంఈసి, సిఈసీ గ్రూపులలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులు ఇంటర్మీడియట్‌తో పాటు ఐఐటీ, నీట్‌లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్మీడియట్‌లో ఇంగ్లీషు మీడియం చదువాలిసి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భారతీ పాల్గొన్నారు.

## ఏఐ టెక్నాలజీతో చందమామ కథలను అందుబాటులోకి తెచ్చిన స్వేచ్ఛ



ఏఐ చందమామ కథలను ప్రారంభిస్తున్న శోబు యార్లగడ్డ తదితరులు

గచ్చిబౌలి, జనవరి 6 ప్రభాతవార్త: తెలుగు వారికి ఇష్టమైన చందమామ కథలను ఏఐ టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకువచ్చారు. గతతరం వారు ఎంతో ఇష్టంగా చెప్పుకున్న చందమామ కథలను నేటి తరానికి ఉపయోగ కరమైన విధానంతో స్వేచ్ఛ సంస్థ ఆధ్వర్యంలో ఎఐ టెక్నాలజీతో అందుబాటులో ఉంచారు. ఈ ఎఐ చందమామ కథలను గచ్చిబౌలిలోని సుంద రయ్య విజ్ఞాన కేంద్రంలో స్వచ్ఛ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్కా మీడియా వర్క్స్ వ్యవస్థాపకులు శోబు యార్ల గడ్డ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శోభు యార్లగడ్డ మాట్లాడుతూ తెలుగు వారందరికి ఇష్టమైన చందమామ కథలను ఎఐ ఉపయోగించి చెప్పేందుకు ముందుకు వచ్చిన స్వేచ్ఛను అభినందించారు. స్వేచ్ఛ వ్యవస్థాపకులు కిరణ్‌చంద్ర మాట్లాడుతూ చందమామ కథలను ఏఐలో అనువదించడం గత జ్ఞాపకాలను గుర్తు చేసిందని, 20ఏళ్ల క్రితం మొదటి తెలుగు ఫాంట్‌ను, అపరేటింగ్ సిస్టంను రూపొందించడం లో చేసిన కృషిని గుర్తు చేసిందన్నారు. ఓజోనెటెల్ సహ వ్యవస్థాపకుడు చైతన్య చొక్కారెడ్డి మాట్లా డుతూ చంద మామ కథలను ఏఐలో అందుబాటులోకి తీసుకురావడం ప్రారంభమేనని, దీన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు తెలుగు ఏఐ మోడల్స్ కోసం ప్రణాళి కలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. స్వేచ్ఛ నిర్వాహకులు మాట్లాడుతూ పాత మ్యాగజైన్‌ల నుంచి డిజిటల్‌గా మార్చబడిన తెలుగు పాఠాన్ని సరిదిద్దేందుకు ఎంతోమంది ఇంజనీరింగ్ విద్యార్థుల సహాయం తీసుకున్నామని అన్నారు. స్ప్రింట్ సమయంలో మొత్తం 40వేల కథలను మార్చడం జరిగిందని, ఈ మొత్తం కథలను ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో గాయకుడు రామ్ మిరియాల, ఐఐటిఎం ప్రొఫెసర్ గౌరవ్ రైనా, ప్రొఫెసర్ కెఎస్.రాజన్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

### త్వరలో పరిష్కారిస్తామని మంత్రి పొంగులేటి హామీ



రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న ఫెడరేషన్ నాయకులు

సైఫాబాద్, జనవరి 6 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర సమాచార, రెవిన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు పులిపలుపుల ఆనందం తదితరులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సోమయ్య మంత్రితో మాట్లాడుతూ గతంలో జర్నలిస్టులకు మూడు సార్లు ఇళ్ళ స్థలాలను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని, ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే ఇళ్ళ స్థలాలు ఇస్తుందన్న నమ్మకం ఉందని చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఒకేసారి వంద కోట్ల రూపాయలు నిధులు విడుదల చేయాలని, చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు ఇచ్చే సహాయాన్ని 5 లక్షలకు పెంచాలని, పదవి విరమణ పొందిన జర్నలిస్టులకు పెన్షన్ స్కిమ్‌ను అమలు చేయాలని, పూర్తిస్థాయిలో హెల్త్ కార్డులు జారీ చేసి అన్ని ప్రైవేటు, కార్పోరేట్ ఆసుపత్రులలో పని చేసే విధంగా ఆదేశాలు జారీ చేయాలని సోమయ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు బనాయింపులు జరిగాయని, అలాంటివి భవిష్యత్తులో జరగకుండా నిరోధించాలని, ఆర్టీసీ బస్‌లలో ఉచిత ప్రయాణ సౌకర్యం, రైల్వే రాయితీ పాస్‌ల పున రుద్ధరణకు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకు రావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీని వాస్‌రెడ్డి స్పందిస్తూ గత ప్రభుత్వం జర్నలిస్టులను నిర్లక్ష్యం చేసిన విషయం వాస్తవమేనని, జర్నలిస్టుల సమస్యలపై తమకు పూర్తిగా అవగాహన ఉందన్నారు. గతంలో జర్నలిస్టులకు మేలుచేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. త్వరలోనే సమస్యలను పరిష్కారిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి గుణపాఠం చెప్పాలి

సైఫాబాద్, జనవరి 6 ప్రభాతవార్త: దేశాన్ని అప్పుల్లో ముంచి, మోయలేని భారాన్ని దేశ ప్రజలపైన రుద్దిన బిజెపి ప్రభుత్వానికి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని లోక్‌దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి పి.వెంకటరాజేశ్వర్‌రావు కోరారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ సంస్థల పరం చేయడం, వివిధ శాఖల్లో ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం వంటి విధానాలను అవలంబించి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన బిజెపిని ఓడించాలని విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్, జగిత్యాల నుంచి వచ్చిన 20 మంది శనివారం నాడిక్కడ లోక్‌దళ్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంతొమ్మిదన్నర సంవత్సరాలపాటు దేశ ప్రజలకు చేసింది ఏమిలేదని, రామనామం పేరిట మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో ఒక్కటి కూడా బిజెపికి దక్కకుండా చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్‌బాబు, బాలయ్య, ఆంజనేయులు, రాజు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎం.నర్సింహ్మ

సైఫాబాద్, జనవరి 6 ప్రభాతవార్త: నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో గత రెండు దశాబ్దాలుగా 15 వేల మంది ఉద్యోగులు వివిధ కేటగిరిలలో కాంట్రాక్ట్ ఉద్యో గులుగా పనిచే స్తున్నారని వీరికి సు ప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ పథకంలోని ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. శనివారం ఎఐటియుసి కార్యాలయంలో ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల బెసిక్ వేతనం కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వవలసి ఉన్నప్పటికి గతంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా వేలాది కార్మికులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమా రాజేష్‌ఖన్నా మాట్లాడుతూ కార్మికులకు జరిగిన అన్యాయాలపై ప్రభుత్వానికి ప్రభుత్వానికి పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాపుయాదవ్, బాలసుబ్రమణ్యం, బత్తుల విష్ణుమూర్తి, సుమన్, నర్సింహా, రాజేశ్వరి, వరలక్ష్మి, రేణుక, సంగీత, రాజు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని కార్మికుడి మృతి

కుత్బుల్లాపూర్, జనవరి 6 ప్రభాతవార్త : గుర్తు తెలియని వాహనం ఢీకొని కార్మికుడు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జగద్గిరిగుట్ట పైప్‌లైన్ రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జగద్గిరిగుట్టకు చెందిన అర్జున్(37) జీడిమెట్ల పారిశ్రా మికవాడలోని ఓ ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వర్తిస్తు న్నాడు. శనివారం షాపూర్‌నగర్ నుండి జగద్గిరిగుట్ట లోని తన ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా దంపింగ్‌యార్డు వద్ద గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. రోడ్డుపై పడివున్న అర్జున్‌ను చూసిన వాహనదారులు పోలీసులకు సమాచారం అందించగా అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించకగా అతడు అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈమేరకు జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న వి.హనుమంతరావు, రోహిన్‌రెడ్డి

## అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, జనవరి 6 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ కు గడుపు శనివారంతో ముగియనుండటంతో బాగ్ అంబర్‌పేట డివిజన్, భరత్‌నగర్ కమిటి హాల్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు, అంబర్‌పేట కంటెస్టెంట్ ఎమ్మెల్యే, కైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు డా.రోహిన్‌రెడ్డి చేపట్టారు. ఈ కార్యక్రమంలో టి-పిసిసి ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల ఉషశ్రీశ్రీకాంత్‌గౌడ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మోతా రోహిత్, నాయకులు గరిగంటి రమేష్, దిడ్డి రాంబాబు, పులి జగన్, యాసిన్, రాజేశ్వర్‌రావు, శ్రీధర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య అక్షింతల పంపిణీ



అల్వాల్ జనవరి 6,ప్రభాతవార్త : అయోధ్యలో ఈ నెల 22వ తేదీన శ్రీరామ విగ్రహ ప్రతిష్టాపన ను పురస్కరించుకొని ఏఆర్ కే హోమ్స్‌లో సభ్యులు అక్షింతల కలశాన్ని తలపై ధరించి ఇంటింటికి వెళ్లి ప్రతి కుటుంబానికి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను పంపిణీ చేసారు. శనివారం రోజున ఐరిస్ బ్లాక్‌లో అక్షింతలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు,అర్జున్ ప్రసాద్, గోపాలరావు, మూర్తి,అరుంధతి,సీతా,వనిత,జ్యోతి, స్వప్న పాల్గొన్నారు.

## సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

ఘట్‌కేసర్, జనవరి 6, ప్రభాతవార్త: ఘట్‌కేసర్‌లో రెడ్డి సంక్షేమ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఘట్‌కేసర్‌లోని రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి-ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి 2024 సంవత్సరం కాలమానికను సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. రెడ్డి కులస్థుల సంక్షేమానికి అందరూ కలిసి సమిష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు కట్టా జనార్దన్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, కొమ్మిడి అనురాధ, సింగిరెడ్డి సాయిరెడ్డి, సహకార సంఘం డైర్కటర్ చందుపట్ల ధర్మారెడ్డి, కీసరగుట్ట డైర్కటర్ ఎంపాల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవుల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలి

### బిసియువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్ కుమార్



ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న రాజ్‌కుమార్, గుజ్జకృష్ణ తదితరులు

హైదరాబాద్,జనవరి 6,ప్రభాతవార్త: నామినేటెడ్ పోస్టుల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిసియువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజకుమార్ డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్ బిసిభవన్‌లో బిసిసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని నామినేటెడ్ పదవుల్లో అధికశాతం ఉన్న బిసిలకు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలోని బిసిజనాభా ఎక్కువగా ఉందని ఇది పరిగణలోకి తీసుకుని ప్రాముఖ్యత పదవులను కేటాయించాలన్నారు. అలాగే ప్రైవేట్ సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు బిసిలకు కల్పించాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సమవర్ధవంతమైన బిసి నాయకులను ఎంపిక చేసి వారికి టికెట్ కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో గెలుపొందుతారని రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, బిసిసంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజేందర్, గ్రేటర్ హైదరాబాద్ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బండారి కుమార్ పాల్గొన్నారు.

## సమస్యలన్నీ తప్పకుండా తీరుస్తాం

### జర్నలిస్టు సంఘాలకు మంత్రి పొంగులేటి హామీ

హైదరాబాద్, జనవరి 6,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో అనేక ఆర్థిక మూలాలతో ముడిపడిఉన్న సమస్యలు ఎన్నో ఉన్నాయని అందులో జర్నలిస్టు సమస్యలు కూడా ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని అవన్నీ తప్పకుండా ప్రణాళిక బద్ధంగా తీరుస్తామని రాష్ట్ర పౌర సమాచార సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శనివారం తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘాలతో ప్రత్యేక సమావేశం అయ్యారు. ఈసందర్భంగా అఖిలభారత వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జాతీయ అధ్యక్షులు కె.కోటేశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్షులు అనంచిన్ని వెంకటేశ్వర్‌రావులతో మంత్రి మాట్లాడారు. జర్నలిస్టులకు ఉన్న అనేక సమస్యలలో ఎక్కువ సమస్యలను పరిష్కరించే మార్గాలతోపాటు, చిన్న,మధ్య తరగతి పత్రికల మనుగడ కోసం భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలనుకుం టున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరగా ఆసమస్యలు పరిష్కరించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈవిషయంలో జర్నలిస్టు సంఘాల సూచనలపై ముందుకు సాగుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

### దేశమంతా రామమయం కావాలి : కొంతం దీపిక

అడ్డగుట్ట, జనవరి 6 ప్రభాతవార్త: సీతారామ చంద్రుల అనుగ్రహం మనందరిపై ఉండాలని, దేశమంతా రామమయం కావాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. శనివారం రెజిమెంటల్ బజార్‌లో అయోధ్య రాముడి నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికి ఆమె పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంట్లో ఐదు రామ జ్యోతులను వెలిగించి దీపావళి పండగ జరుపుకోవాలన్నారు.

## ఆహుతులను ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



మణికొండ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతి అందజేస్తున్న చైర్మన్ కస్తూరి నరేందర్

నార్సింగి, జనవరి 6 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్ నేతాజీ పార్కులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మనస్సులను హత్తుకునేలా రంగు రంగుల ముగ్గులు వేశారు. ఈ ముగ్గుల పోటీలను మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలను భావి తరాలకు అందించేందుకు పర్వదినాలు ఉపకరిస్తాయని తెలిపారు. పెద్దలంతా మన ధర్మంను పాటిస్తూ, చిన్నారులకు కూడా అలవాటు చేయాలని సూచించారు. ప్రపంచ దేశాలన్నింటికి భారత సంస్కృతి తల్లివంటిదని తెలిపారు. సంక్రాంతి పండగ వచ్చిందంటే చాలు యువతులు, మహిళలు అందమైన ముగ్గులు వేసేందుకు పోటీ పడుతుంటారన్నారు. వాసవీ క్లబ్ నిర్వాహకులు మహిళలను ప్రోత్సహించేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీలలో మొదటి స్థానంలో అనూష, రెండో స్థానంలో పావని, మూడో స్థానంలో రమ్యలు నిలిచ్చారు.ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షులు వంశీకృష్ణ వంగపేటి, కార్యదర్శి విఎన్.యశ్వంత్ తల్లాడ, కోశాధికారి విఎన్ఎల్ శిరీశ, రీజినల్ కో ఆర్డినేటర్ విఎన్.గంగిశెట్టి నవీన్ కుమార్, జోనల్ కో ఆర్డినేటర్ విఎన్ఎల్.నిరీష తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

### : కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇంచార్జీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే బండి రమేష్



మీడియాతో మాట్లాడుతున్న బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 6, ప్రభాతవార్త : పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని స్వచ్ఛమైన పరిపాలన కాంగ్రెస్‌తోనే సాధ్యపడుతుందని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే బండి రమేష్ పేర్కొన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా చివరి రోజు శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఇందిరానగర్, బాలాజీ నగర్, కెపిహెచ్‌బి 4వ ఫేస్ రమ్యాగ్రౌండ్, మూసాపేట్‌లలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సెంటర్లలో పాల్గొని అధికారులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలనలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో నాలుగు లక్షల దరఖాస్తులు వచ్చాయని వాటిల్లో ఇల్లు లేని నిరుపేదలు, రేషన్‌కార్డులు దరఖాస్తులు అధికంగా వచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లిలో ప్రభుత్వ భూములు, చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు నిద్రావస్థలో ఉన్నారనీ అక్రమ నిర్మాణాలు కోకొల్లలుగా జరుగుతున్న పట్టించుకోవడం లేదని బండి రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో విద్య వైద్య ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయని వీటి అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రధానంగా మూసాపేట వై జంక్షన్ బోయినపల్లి వై జంక్షన్ ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందని నియంత్రణ కోసం ఫ్లై ఓవర్ ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు. కూకట్‌పల్లి ప్రజల కోసం వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రధానంగా బాలానగర్‌లో ఇంటర్, డిగ్రీ కాలేజీలు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఈ కాలేజీలు వచ్చే విధంగా చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేరి సతీష్‌రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, సునీల్ యాదవ్, ఏ బ్లాక్ అధ్యక్షులు వేణు, సంతోష్, స్వరూప, వి.రాజేష్ గౌడ్, మల్లేష్ యాదవ్, నయూమ్, జి.సతీష్‌రెడ్డి, కర్రమ్మ, మారుతి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు సమీర్ వలి ఉల్లా,అలీ మస్కతి,ముజీబుల్లా షరీఫ్

చార్మినార్,జనవరి 6 ప్రభాతవార్త : ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు సమీర్ వలి ఉల్లా అన్నారు. చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గంలోని దారుషిఫా,సుల్తాన్‌షాహితో పాటు పలు ప్రాంతాలలోని ప్రజా పాలన ధరఖాస్తుల కేంద్రాలను ఆయన పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తప్పకుండ ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని తెలిపారు.హైదరాబాద్ పాతబస్తీలో ప్రజా పాలన కార్యక్రమానికి మంచి స్పందని ప్రజలు నుంచి లభించిందని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అలీ మస్కతీ, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ ముజీబుల్లా షరీఫ్, అస్లాం షరీఫ్,దినేష్ బిడ్లా,శ్రావణ్,శ్రీకాంత్,అమన్ ఉల్లా షరీఫ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## సోమవంశ సహస్రార్జున క్షత్రియ క్యాలండర్ ఆవిష్కరణ



సోమవంశ సహస్రార్జున క్షత్రియ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పోరేటర్ పన్నాల

నాచారం, జనవరి 6 ప్రభాతవార్త: మల్లాపూర్‌లోని శ్రీ సోమవంశ సహస్రార్జున క్షత్రియ సమాజ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమాజ అధ్యక్షుడు సూర్యప్రకాష్ రతన్,ప్రధాన కార్యదర్శి సర్వేష్, మన్మోహన్, ఎన్.రామచందర్ షా, ఆర్.విషాల్, రాజ్‌కుమార్, శంకర్, వి.విషాల్, కుబీర్ శ్యామ్ కుమార్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలు

దీంతోపాటు మహిళల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ముగ్గుల పోటీలు ఐక్యతకు, ఆప్యాయతకు నిదర్శనమన్నారు. సంక్రాంతి పండుగ ప్రకృతి పండుగ అని తెలిపారు. సాంస్కృతిక అంశాలు మానసిక వికాసానికి శారీరక ఆరోగ్యానికి ఏకాగ్రతకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితియ, తృతీయ బహుమతులు అందజేశారు. అలాగే పోటీలో పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ వీర మహిళలు ముంతాజ్, ఎర్రసత్యా, పుష్పలత, సరోజినీదేవి, జనసేన నాయకులు మండలి దయాకర్, కొల్లా శంకర్, కిషోర్ నాగరాజు, అంజి, సత్యసాయి, సుబ్బు, షణ్ముఖ, శ్రీనివాస్‌గోవిందా, కమలాకర్, వెంకట్, శివ మోటేపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ అత్తాపూర్ నుండి హంపి వరకు జరిగిన కారు ర్యాలీని రోటరి క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ ఆర్‌సిహెచ్‌డి అధ్యక్షుడు అనిత రాంచందాని జెండా ఊపి ప్రారంభిస్తున్న చిత్రం

## రోబోటిక్స్ ఈవెంట్ ప్రారంభం

నిజాంపేట్, జనవరి 6, ప్రభాతవార్త : బాచుపల్లిలోని విఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాలలో 2రోజుల పాటు జరగనున్న సౌత్ ఇండియాస్ బిగ్గెస్ట్ రోబోటిక్స్ ఈవెంట్ శనివారం పాఠశాల ట్రస్ట్ సభ్యుడు వల్లూరిపల్లి రాజశేఖర్, డైరెక్టర్ కొడాలి విజయరాణి, మేనేజర్ చలసాని సాయాజీరావులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుండి దాదాపు 500మంది విద్యార్థులు వచ్చారు. విఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుండి రోబోటిక్స్ ఫీల్డ్ నుండి సుమారు 20మంది నిపుణులతో ఈ ఈవెంట్‌ను నిర్ణయించారు. పాఠశాల ట్రస్ట్ సభ్యుడు రాజశేఖర్ విద్యార్థులతో మాట్లాడుతూ వైద్యం, విద్య, పారిశ్రామిక రంగాలలో రోబోటిక్స్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్మించుకునే వినూత్న పద్ధతుల్లో ప్రపంచాన్ని అన్వేషించాలని ఆయన సూచించారు.

## రాబోయే పార్లమెంట్ ఎలక్షన్లపై చర్చ



మేడ్చల్ మల్కాజగిరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డిని కలిసిన సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్, జనవరి 6, ప్రభాతవార్త : మేడ్చల్ మల్కాజగిరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోలన్ శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాబోయే పార్లమెంట్ ఎలక్షన్ల గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి కాంగ్రెస్ ప్రెసిడెంట్ కోలన్ రాజశేఖర్‌రెడ్డి, జూలకంటి లక్ష్మారెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఆయా డివిజన్ల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీరాముని సేవలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి : రామక్రిష్ణ



5వ వార్డులో ఇంటింటికి శ్రీరామ అక్షింతలు వితరణ చేస్తున్న కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామక్రిష్ణ తదితరులు

కంటోన్మెంట్, జనవరి 6 ప్రభాతవార్త: అయోధ్య శ్రీ రామ మందిర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ ఎసభ్యుడు జె.రామక్రిష్ణ తెలిపారు. శనివారం కంటోన్మెంట్ 5వ వార్డు కాకగూడలోని వీరాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన పూజలు నిర్వహించి తలపై అక్షింతల కలచాన్ని ఎత్తుకొని శ్రీరామ జయరామ జయ జయ రామ అంటూ కాలనీలో శోభయాత్ర నిర్వహించి ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ నెల 22వ తేదీన బలరాముని ప్రాణ ప్రతిష్ఠ, రామ మందిర ప్రారంభ వేడుకలను ప్రతి ఒక్కరు జరుపుకొని దీపావళివలే ఎసంబరాలు జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు హేమంత్ శర్మ, బిజెపి కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### పాపిరెడ్డి నగర్‌లో రోడ్లు భూగర్భ

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



వెంకటేశ్వరరావుకి వినతిపత్రం అందజేస్తున్న చంద్రారెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 6, ప్రభాతవార్త : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శనివారం పాపిరెడ్డి నగర్‌లో రోడ్లు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని అభివృద్ధి పరచాలని కోరుతూ ప్రజా పాలన ఇన్‌చార్జీ వాటర్ వర్క్స్ జిఎం వెంకటేశ్వరరావుకి పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వి.చంద్రారెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆర్.భగవంతురెడ్డి, పి.ధర్మారావు, రామకృష్ణారెడ్డి, జి.బి.కన్నారావు, వసంతరెడ్డి, యాదగిరి మేస్త్రీ, ఎల్లారెడ్డి, వనం ఆంజేయులు, పాషాభాయ్, ఎం.కనకారెడ్డి, పాండుగౌడ్, ముత్యం వెంకటరెడ్డి, విజయకృష్ణారెడ్డి, వీరేశం, శోభ, పద్మ, సులోచన, వెంకటలక్ష్మి, రాణి, స్వర్ణలత, స్వాతి బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయి : జంపనప్రతాప్



బోయిన్‌పల్లిలోని అంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్,రాఘవరెడ్డి తదితరులు

కంటోన్మెంట్,జనవరి6 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 1వ వార్డు బోయిన్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన బాలహనుమాన్ దేవాలయాన్ని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపప్రతాప్ తెలిపారు. శనివారం ఆలయ వారి ్షోత్స్వవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పున నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వేత్త సామల రాఘవరెడ్డి, వి.ఆర్. ఆసుపత్రి ఎండి నంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మా డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



సికింద్రాబాద్, జనవరి 6 ప్రభాతవార్త: ప్రముఖ ఫార్మా సంస్థ విబ్రస్ ఫార్మా వార్షిక డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సీతాఫల్‌మండి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ విబ్రస్ ఫార్మా డైరీని అవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో ఫార్మా రంగంలో అధునాతన మార్పులు చోటు చేసుకుంటున్నాయని, రోగులలకు మేలు చేకూర్చేలా అన్ని సంస్థలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విబ్రస్ ఫార్మా సంస్థ తన విశిష్ట సేవలను అందిస్తోందని, సేవా కార్యాకలాపాలు కూడా నిర్వహించడం ప్రశంసనీయమని అన్నారు. విబ్రస్ ఫార్మా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) బీఆర్ఎస్ నాయకుడు సుంకు రాంచందర్ మాట్లాడుతూ లాభాపేక్షతో కాకుండా తమ కార్యాకలాపాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యాక్రమంలో యువనేత కిరణ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

## ఈస్ట్‌జోన్ డీసీపీకి నేతల శుభాకాంక్షలు

సికింద్రాబాద్, జనవరి 6 ప్రభాతవార్త: సికింద్రాబాద్ నియోజకవర్గం బీజేపీ నేతలు ఈస్ట్‌జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈస్ట్‌జోన్ డీసీపీగా బి. సాయిశ్రీ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు ఆమేకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యాక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. రవిప్రసాద్ గౌడ్, సికింద్రాబాద్ నియోజకవర్గం కన్వీనర్ నాగేశ్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పోచయ్య యాదవ్, జిల్లా నాయకుడు నగరపు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని

## కలిసిన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

గచ్చిబౌలి, జనవరి 6 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి కలిశారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గచ్చిబౌలి డివిజన్ పరిధిలో పనిచేస్తున్నామని అన్నారు. గచ్చిబౌలి డివిజన్ ప్రజల కు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు అందించేందుకు, సమస్యలను ఎప్పటికప్పు డు పరిష్కరించేందుకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని, రాజకీయాలతో సంబంధం లేకుండా తెలంగాణ ముఖ్యమంత్రి, కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, స్థానిక పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేల సహకారంతో డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నానన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో పాటు గచ్చిబౌలి డివిజన్ బిజెపి నాయకులు ఉన్నారు.

## విద్యార్థికి ప్రతి నిమిషం ఎంతో విలువైంది

**విద్యార్థులు రాణించి దేశానికి, తల్లి తండ్రులకు కీర్తిప్రతిష్టలు తేవాలి**

**ఉస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ లక్ష్మీ నారాయణ**



మెథడిస్ట్ కాలేజి గ్రాడ్యుయేషన్ వేడుకలలో పాల్గొన్న ఓయూ రిజిస్ట్రార్ డాక్టర్ లక్ష్మీనారాయణ

ముషీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త: విద్యార్థులకు ప్రతి నిమిషం ఎంతో విలువైందని, సమయాన్ని వృధా చేయకుండా ప్రతి నిమిషాన్ని విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకై సద్వినియోగం చేసుకోవాలని ఉస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ లక్ష్మీ నారాయణ సూచించారు. శనివారం బాగ్‌లింగంపల్లి ఆర్‌టీసీ కళాభవన్‌లో అబిడ్స్ మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నుండి 2022-2023 లో ఉత్తీర్ణులైన విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధిగా హాజరై లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరంగా నేడు చోటుచేసుకుంటున్న విప్లవాత్మక మార్పులను అందిపుచ్చుకుని విద్యార్థులు రాణించాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యార్థులు కేవలం తమ పాఠ్యాంశాలు మాత్రమే కాకుండా అత్యధిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకుని, ఉన్నతస్థాయిలో రాణించటం ద్వారా మన దేశానికి, తల్లి తండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఓయూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాములు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యానికే పరిమితం కాకుండా పదిమందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల కరస్పాండెంట్ కే.కృష్ణారావు మాట్లాడుతూ మెథడిస్ట్ కళాశాల విద్యార్థులు ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లి అత్యున్నత పదవులు అధిరోహించి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా దాదాపు 700 విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ ప్రదీప్‌రెడ్డి, టి.రాకేష్‌రెడ్డి, డాక్టర్ ఎం.లక్ష్మీపతిరావ్, ప్రిన్స్‌పాల్ డాక్టర్ ప్రభు జి బెనకాప్, కన్వీనర్ మరియు హెచ్ఓడీ డాక్టర్ వై.మస్తానమ్మ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏ.సచ్చేంద్రనాథ్, పీఆర్ఓ ఆర్.శ్రీకాంత్ మరియు కళాశాల సిబ్బంది, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

### ముదిరాజ్‌లను బిసిఏలో

## చేర్చే ప్రక్రియ ప్రారంభించాలి

**తెలంగాణ ముదిరాజ్ మహావేదిక డిమాండ్**



సమావేశంలో మాట్లాడుతున్న గుండ్లపల్లి శ్రీను, అల్లుడు జగన్ తదితరులు

హైదరాబాద్, జనవరి 6,ప్రభాతవార్త: కాంగ్రెస్‌పార్టీ తమ మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ముదిరాజ్‌లను బిసిడినుంచి బిసిఏలోకే మార్చే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ ముదిరాజ్ మహావేదిక డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక రాష్ట్ర కన్వీనర గుండ్ల పల్లి శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 50లక్షల మంది ముదిరాజ్‌ల సంక్షేమం, రాజకీయ సమాన ప్రాతినిథ్యం సాధించడమే ఈవేదిక ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం ముదిరాజ్‌లకు కోకాపేట్‌లో 5ఎకరాల స్థలం, భవన నిర్మాణం కోసం 5కోట్లు కేటాయించిందన్నారు. అయితే ఇప్పటివరకు అదిపూర్తి కాలేదని దానిని వెంటనేపూర్తి చేయాలన్నారు. కోన్వీనర్ అల్లుడు జగన్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్‌లకు లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్, మెదక్, జహీరాబాద్, భువనగిరి స్థానాల్లో ప్రాధాన్యత ఇస్తే తప్పగ గెలుస్తామన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించిన వాకిటి శ్రీహరి ముదిరాజ్‌కు మంత్రి పదవుల్లో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన ముదిరాజ్‌లకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కాగా వేదిక ఆధ్వర్యంలో 33జిల్లాల్లో పర్యటించి విద్యార్థులు, యువత, మేధావులతో చర్చించి సమిష్టి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర సమన్వయ కర్త బొక్క శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు ఉప్పరవేణి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా కార్నివాల్

**హాజరైన సుమ కనకాల, రోషన్ కనకాల**



విద్యార్థులతో కలిసి సుమ కనకాల, రోషన్ కనకాల

గచ్చిబౌలి, జనవరి 6 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు, ఎన్‌జిఓలకు సహాయం చేసేందుకు నిధుల సేకరణ కోసం ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన కార్నివాల్ ఉత్సాహంగా సాగింది. ప్రతి సంవత్సరం ఓక్రిడ్జ్ విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహించేందుకు నిధుల సమీకరణ కోసం కార్నివాల్‌ను నిర్వహిస్తుంటారు. కాగా ఈ సంవత్సరం నిర్వహించిన కార్నివాల్‌కు యాంకర్ సుమా కనకాల, స్కూల్ పూర్వ విద్యార్థి, హీరో రోషన్ కనకాలలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్నివాల్‌లో విద్యార్థులు తమ కళానైపుణ్యాన్ని ఉపయోగించి తయారు చేసిన పలు ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా సుమ కనకాల మాట్లాడుతూ టాలెంట్ ఎవ్వరి సొత్తు కాదని, మనకు ఏ రంగంలో టాలెంట్ ఉందో గుర్తించి సదరు రంగంలో అగ్రగామిగా నిలిచేందుకు ప్రయత్నించాలన్నారు. ఇతరులను అనుకరించి వారి మాదిరిగా రాణించాలని వెళితే విఫలమయ్యే అవకాశం ఉందన్నారు. హీరో రోషన్ కనకాల మాట్లాడుతూ స్కూల్ తనకు ఎన్నో నేర్పించిందని, ఇక్కడ అందించిన జ్ఞానంతోనే తాను ఈ స్థాయికి ఎదిగానన్నారు. ప్రిన్సిపాల్ దీపికారావు మాట్లాడుతూ ఓక్రిడ్జ్ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు సేవా దృక్పథాన్ని నేర్పించడం, క్రీడల్లో రాణించే విధంగా శిక్షణ ఇవ్వడం మీద దృష్టి సారిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓక్రిడ్జ్ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రదర్శన చేసిన కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

## యువజనోత్సవలతో కళాకారుల్లో ఉత్తేజం

**రాష్ట్ర యువజన సర్వీసులశాఖ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు**

హైదరాబాద్, జనవరి 6,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర యువజనోత్సవాలు కళాకారుల్లో మరింత ఉత్తేజాన్ని నింపిందని రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్, కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈమేరకు రాష్ట్ర యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో రెండురోజులపాటు నిర్వహించిన ఉత్సవాలు శనివారం సాయంత్రం ముగిశాయి. నగరంలోని శిల్పారామంలోని సాంప్రదాయ కళావేదికలో జరిగిన ఈయువజనోత్సవాల్లో రాష్ట్రంలోని 33జిల్లాలకు చెందిన 1200మంది కళకారులు, యువతీ, యువకులు పాల్గొని ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చారు. ఈసందర్భంగా కమిషనర్ పోటీల్లో పాల్గొని ఉత్తమప్రతిబ కనబర్చిన కళాకారులకు సర్టిఫికేట్లు ప్రధానం చేశారు. అలాగే ఎంపిక చేయబడ్డ 20మంది కళాకారులకు బహుమతులు అందజేశారు. అలాగే ఈపోటీల్లో 70మందిని సెలెక్ట్ చేసి ఈనెల 12న మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే 27వ జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొని తెలంగాణ సాంస్కృతి సాంప్రధాయాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌స్టెప్ జనరల్ మేనేజర్ కె.వేణుగోపాల్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ అనంత్‌రెడ్డి, జగన్నాథం, ఎకౌంట్స్ ఆఫీసర్ టీ.ఓంప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

### రంగనాయక స్వామి

## ఆలయంలో ఘనంగా పల్లకిసేవ పూజలు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 6, ప్రభాత వార్త: పోచారం మున్సిపల్ పరిధిలోని యంనంపేట్ రంగనాయక స్వామి ఆలయంలో శనివారం జరిగిన పల్లకి సేవా, అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అతి పురాతనమైన వెంకటేశ్వర స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆ భగవంతుడి ఆశీర్వాదాలు ప్రజలందరిపై ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ పి. వేమన రెడ్డి, ఆలయ ఈవో ఎల్. భాగ్యలక్ష్మి, కౌన్సిలర్లు నర్రి ధనలక్ష్మీకాశయ్య, సింగిరెడ్డి సాయిరెడ్డి, బాల్‌రెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మందాడి సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు జి. బాలేశ్ కురుమ, నాయకులు బోయపల్లి సత్తిరెడ్డి, బి. జగన్‌మోహన్ రెడ్డి, అబ్బవతి నర్సింహ, బొక్కా బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

## డీసీపీని కలిసిన ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 6, ప్రభాతవార్త: మల్కాజ్‌గిరి డీసీపీగా బాధ్యతలు చేపట్టిన పి.వి.పద్మజారెడ్డిని శనివారం ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.మహేందర్‌రెడ్డి కలిశారు. మల్కాజ్‌గిరి డీసీపీ జానకీ బదిలీ కావడంతో పద్మజారెడ్డి నూతన డీసీపీగా వచ్చి కారా ్యలయంలో బాధ్యతలు స్వీకరించడంతో సీఐ మహేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా వెళ్లి ఆమె పుష్పగుచ్చం అందించి పూలమొక్క ఇచ్చారు.

### నవరసభరితం ముగ్ధమనోహారం

## నల్లారి హెత్విత కూచిపూడి రంగప్రవేశం



రవీంద్రభారతి, జనవరి 6 ప్రభాతవార్త : ప్రఖ్యాత కూచిపూడి నాట్యకళాకారిణి, గురువు, తెలంగాణ సంగీత నాటక అకాడమీ మాజీ ఛైర్‌పర్సన్ దీపికిరెడ్డి శిష్యురాలు, సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సోదరుడి కుమార్తె నల్లారి హెత్విత గురువు వద్ద కూచిపూడిని సంపూర్ణంగా అభ్యసించి నేడు తన కూచిపూడి రంగప్రవేశం ప్రతిష్టాత్మక జాతీయ కళామందిరం రవీంద్రభారతి ప్రధాన వేదికలో శనివారం రాత్రి నవ సరభరితం, ముగ్ధమనోహారంగా ఆరంగేట్రంలోనే సంపూర్ణ కళాకారిణిగా అద్భుత నాట్యవిన్యాసాలతో ఆహు తులైన అశేష ప్రేక్షకులను ఎంతగానో అలరించి ఆకట్టుకొని మంత్రముగ్ధులనుచేసి గురువుకు తగ్గ శిష్యురాలిగా ప్రశంసలందుకుంది. హెత్విత తన రంగప్రవేశాన్ని ముందుగా శ్రీ విఘ్నరాజం భజే అంశంతో ప్రారంభించి; అనంతరం భామనే సత్యభామనే... భామ ప్రవేశదరువు; శివశివ భవభవ శరణం; అన్నమాచార్య కీర్తన అలరులు గురియగ; తిల్లానా తదితర అంశాలను అత్యంత బహుముఖ నాట్యప్రదర్శనతో కనువిందు చేశారు. గురువు దీపికారెడ్డి నట్టువాంగం, డిఎస్‌వి.శాస్త్రి గాత్రం, కె.రాజగోపాలాచారి మృదంగం, కె.సాయికుమార్ వయోలిన్, విబిఎస్.మురళి వేణువులతో అద్భుత వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలు, విశిష్ట అతిథులుగా జాతీయ నాటక అకాడమీ ఛైర్మన్ డా. సంధ్య, పద్మశ్రీ సునీతకోష్లీ, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాసరెడ్డి, దాట్ల వనిత, నాట్యగురువు దీపికారెడ్డి తదితరులు పాల్గొని కళాకారిణి నల్లారి హెత్వితను ఎంతగానో అభినందించి శుభాశీస్సులందించి ఘనంగా గురుసత్కారం కావించారు.

## సీజ్ చేసిన డీజిల్ ట్యాంకర్ స్వాధీనం చేసుకున్న సివిల్ సప్లై అధికారులు

బంట్వారం, జనవరి 6 ప్రభాతవార్త : శుక్రవారం మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న డీజిల్ ట్యాంకర్ ను పోలీసులు పట్టుకొని సీజ్ చేసిన విషయం పాఠకులకు విదితమే. అయితే దీన్ని శనివారం టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి డి రామదాసు ఆధ్వర్యంలో బంటారం చేరుకొని సీజ్ చేసిన డీజిల్ ట్యాంకర్ న ు పరిశీలించారు. టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపిన వివరాల మేరకు ఇలా వున్నాయి. ఈ వాహనం డ్రైవర్ లక్ష్మణ్ ను విచారించగా కిషోర్ బాబు యజమానిదని, ఈ డిజిల్ కర్ణాటకలోని కుంచవరం పెట్రోల్ బంక్ న ుండి తెచ్చినట్టు తెలిసిందన్నారు. ట్యాంకర్‌లో అక్రమంగా తరలిస్తున్న డీజిల్ 1750 లీటర్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసినట్టు సివిల్ సప్లై అధికారి తెలియజేశారు. ఈ విచారణలో డిటి రాధా పోలీస్ అధికారులు ఉన్నారు.

## పేద ప్రజల కోసమే ఆరు గ్యారంటీ పథకాలు

**యువజన కాంగ్రెస్ రాష్ట్రప ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు**

కొడంగల్ రూరల్, జనవరి 6 (ప్రభాత వార్త): ప్రభుత్వం పేద ప్రజల కోసమే ఆరు గ్యారంటీ పథకాలను ప్రవేశపెట్టిందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, మున్సిపల్ కౌన్సిలర్ సాయిప్రసన్న అన్నారు. శనివారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో అధికారులు నిర్వహించిన ప్రజాపాలనలో వారు పాల్గొన్నారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆరు గ్యారంటీ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్కప్ప, రమేశ్‌బాబు, దస్తప్ప, అధికారులు పాల్గొన్నారు.

## సైన్స్ ఫెయిర్‌తోనే విద్యార్థుల ప్రతిభాపాటవాలు వెలికి వస్తాయి

షాబాద్, జనవరి 6, ప్రభాతవార్త : విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలతోనే విద్యార్థులో దాగి ఉన్న ప్రతిభాపాటవాలు వెలికి వస్తాయని షాబాద్ సర్పంచ్ సుబ్రహ్మణ్యేశ్వరరవీందర్ తెలిపారు. శనివారం షాబాద్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో అనురాధ, ఎంఈవో శంకర్‌రాథోడ్‌లతో కలిసి వెలిసి వెల్స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజ్ఞాన శాస్త్ర పరిశోధన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగాం వారు మాట్లాడుతూ.... మానవాళికి ఉపయోగపడే విధంగా ప్రకృతికి నష్టం కలగకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలని ఇచ్చే వాటిని కనుగొనాలని విద్యార్థులకు సూచించారు. రేటి భవిష్యత్తు విద్యార్థులపైనే ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులు పలు అంశాలపై తయారు చేసిన ప్రాజెక్టులు, వాటి ఉపయోగాలను అందరికి వివరించారు. ఈకార్యక్రమంలో షాబాద్ బాలుర, బాలికల, కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్ఁథులతో పాటు వెల్స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ తదితరులు ఉన్నారు.


**IN THE COURT OF HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II AT: HYDERABAD.**
**TSA No. 7 OF 2023**

**BETWEEN:**
Smt. Cherkuri Madhulatha and Another ... Applicant
**And**
Federal Bank Limited and Another, Rep. by its authorized officer ...Respondent

**To: Respondents No. 2**
**Sri. V. Aswin Kumar S/o V. Muralidher Rao, Aged about 27 Years Occ: Private Employee, R/o 503, Tirumala Nivas, 16-2-674,/9, Judges Colony, Malakpet, Hyderabad 500 036**

It is informed to you, that my client above named applicant filed the above TSA No. 7 of 2023 before the Hon'ble Debt's Recovery Tribunal – II, Hyderabad against you and the same was posted on 22.01.2024 and the Hon'ble Tribunal directed to serve the notice to you. This is for your information and notice for your appearance. If you do not appear on that day i.e. 22.01.2024 the matter will be decided on merits.

Hence this Notice
**D. RAGHAVULU,** ADVOCATE
H.No. 2-19-55/1, Plot No. 107, Road No. 1, Street No. 8, Kalyanapuri, Uppal, HYD- 13. CELL 9247362430
(By order of the Hon'ble Debts Recovery Tribunal – II, HYDERABAD)

**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my client **Mrs. Pagadala. Hima Bindu, W/o. Mr. Pagadala. Gopinath,** have cancelled the "General Power of Attorney" dt.19-07-2022, vide Document No.1543/2022 executed in favour of Sri.B.Srinivas Rao, S/o. Late. B. Gopal Rao, Aged about 55 years, Occ: Business, R/o. Flat No.102, Titus Residency, Prakash Nagar, Begumpet, Secunderabad, pertaining to the Schedule Property below mentioned, through Registered Cancellation of General Power of Attorney, dt. 20-12-2023, vide document No.2560/2023, before Sub-Registrar, Secunderabad. Hence forth Sri.B.Srinivas Rao, have no right to act as per the TERMS mentioned in "General Power of Attorney" dt. 19-07-2022, as the said GPA is cancelled by my client Mr.Pagadala. Hima Bindu and my client is not liable for any such act/s done by Sri. B. Srinivas Rao, hereafter basing on the above mentioned General Power Attorney.

**SCHEDULE OF THE PROPERTY**
All that the Flat bearing No.102, on First Floor in the complex know as "TITUS RESIDENCY" admeasuring undivided share of land 25 Square yards out of 300 Square yards or 250.8 Square Meters with a built up area of 950 Square feet (including common area and free provision of motor cycle parking space) and car parking are admeasuring 100 Square feet, in premises bearing Muncipal No. 1-8-506/3/1/1 assessed as New No. 1-8-506/3/1/1/102 (Old House No. 1-8-506/3), situated at Gareeb Nagar, Prakasham Nagar, Begumpet, Hyderabad and bounded by: PTI No.1180120421. **NORTH:** CORRIDOR, **SOUTH:** NEIGHBOURS PROPERTY, **EAST:** OPEN TO SKY, **WEST:** FLAT No.101.

**S.C. MURALI MOHAN RAO**
**Advocate**
Flat No.203, F.K.Court, Above Canara Bank, Mettuguda, Secunderabad-500017.
**Mobile: 9346950711**

**IN THE COURT OF THE III ADDITIONAL DISTRICT JUDGE R.R. DISTRICT: AT: L.B. NAGAR:**
**O.S. NO. 280 OF 2022**

Between:
**Neravetla Jaganmohan Reddy** S/o Musla Reddy, aged about 76 years, resident of Plot No.19, BTR Villas, Tummaluru village, Maheshwaram mandal, Ranga reddy district, represented by his G.P.A.
1. **Sursani Mohan Reddy** S/o Yadagiri Reddy, aged about 46 years,
2. **Jangili Param Jyothi** S/o Dasharatha, aged about 46 years,
Both are R/o Lemoor village, Kandukuru mandal, R.R. District. ...Plaintiff
AND
**Chintalpally Suvarna** W/o Bhoopathi Rao, aged about 63 years, R/o H.No. 9-7-62, Yadagiri Nagar, Santoshnagar, Hyderabad. ...Defendant

**PUBLIC NOTICE**
The general public is hereby informed that my clientby name Neravetla Jaganmohan Reddy S/o Musla Reddy, aged about 76 years, resident of Plot No. 19, BTR Villas, Tummaluru village, Maheshwarammandal, Ranga Reddy District, the plaintiff has filed a suit for Declaration in respect of suit schedule property.
Take notice that the said suit is posted on **25-01-2024** for your appearance. Appear **on 25-01-2024 at 10:30 am,** either in person or through your Advocate to file your objections in the matter, failing which the matter will be decided as for the record available with the court.

//By Order of the Hon'ble Court//
**G. Rama Chander Rao**
**G. Vishnu Vardhan**
**Advocates**
H.No. 10-1-74/2, SrinivasaNagar, Lingojiguda, Hyderabad-035.
**Cell: 8977882895, 9502069281**

**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-2, 1st Floor, Triveni Complex, Abids, AT: HYDERABAD**
**O.A.NO: 782 OF 2023**
**Summons under sub-section (4) of Section 19 of the Act, Read With Sub-Rule(2A) of Rule 5 of the Debt Recovery Tribunal Procedure Rules, 1993**
**Union Bank of India**
**Vs**
**M/s.Raja Rajeswari Dairy and Agro Products and Another**

To,
**1. M/s.Raja Rajeswari Dairy and Agro Products, situated at Sy.No.86.87 Nagireddypally, Maheswaram Mandal, Ranga Reddy District-501359, Telangana State, Reptd by its sole proprietor Mr.Marella Bapi Raju**
**....Defendant No.1**

Whereas O.A.No. 782 of 2023 is listed before Hon'ble Presiding Officer/Registrar on 05/01/2024.
Whereas, this Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.45,91,540/- (application along with copies of documents etc., annexed).
In accordance with sub section (4) of section 19 of the Act, you the defendants are directed as under:
(i)To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii)To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(iii)You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties,
(iv)You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v)You shall be liable to account for the sale proceedings realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceedings in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before the Registrar, Debts Recovery Tribunal-2 on 26/02/2024 at 10.30 A.M., failing which the application shall be heard and decided in your absence.
Given under my hand and seal of the Tribunal on this the 5th day of January,2024..

**(BY ORDER OF THE TRIBUNAL)**
**REGISTRAR**
**DEBTS RECOVERY TRIBUNAL-2, HYDERABAD**

## వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల ప్రతిభకు దర్పణాలు: ఇన్స్పెక్టర్, కార్పొరేటర్లు




మెగాసిటీ ఆధ్వర్యంలో హెల్మెట్లను పంపిణీ చేసిన ఇన్స్పెక్టర్, కార్పొరేటర్లు

**సరూర్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:** విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీయడానికి దోహదపడతాయని మీర్‌పేట్ ఇన్స్పెక్టర్ కిరణ్‌కుమార్, మీర్‌పేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు మద్ది సబితా రాజశేఖర్‌రెడ్డి, చల్లా కవితా బాల్‌రెడ్డి, కొండ్రు గౌరీ శంకర్‌లు అన్నారు. జిల్లెలగూడ ఓల్డ్ గాయత్రీనగర్‌లోని మెగాసిటీ గ్రామర్ స్కూల్‌లో శనివారం పాఠశాల డైరెక్టర్ కెవిఆర్ మూర్తి, కరస్పాండెట్ సంధ్యా మూర్తిల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మెగాసిటీ గ్రామర్ సంపూర్ణ విజ్ఞానం సైన్స్ ఎక్స్‌పోకు వారు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు ప్రదర్శించిన అంశాలను తిలకించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సైన్స్ ఎక్స్‌పోలు విద్యార్థుల ప్రతిభకు దర్పణంగా నిలుస్తాయన్నారు.

**విద్యార్థుల తల్లిదండ్రులకు హెల్మెట్ల పంపిణీ...** సైన్స్ ఎక్స్‌పో సందర్భంగా ప్రమాదాల నివారణకోసం మెగాసిటీ గ్రామర్ స్కూల్ యాజమాన్యం బ్రాండెడ్ రకానికి చెందిన స్టీల్ బర్డ్ హెల్మెట్లను ఇన్స్పెక్టర్, కార్పొరేటర్లు విద్యార్థులకు, తల్లిదండ్రులకు రెండేసి చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో న్యూ మాస్టర్ మైండ్స్ కాలేజీ సెక్రటరీ డాక్టర్ రమావత్ పాండు, మెగాసిటీ స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మాతృశ్రీలో ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు




మ్యూజిక్ ప్రోగ్రాం నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు

**సైదాబాద్, జనవరి 6 ప్రభాతవార్త:** సైదాబాద్‌లోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో 'నొవాటోఫీస్టా' పేరిట ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. డాన్స్, మ్యూజిక్, డ్రామాలతో ఆద్యంతం ఉత్సాహభరితంగా కార్యక్రమం కొనసాగింది. మాతృశ్రీ మ్యూజిక్ బ్యాండ్ విద్యార్థుల సంగీతం అందరిని కట్టిపడేసింది. మ్యూజిక్, డాన్స్‌లో పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.పి.శ్రీనివాస్ రావు, కార్యదర్శి ఎం.కృష్ణకుమార్, కోశాధికారి జూపూడి సుధాకర్, ఎం.ఇ.సి.ఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హనుమంతరావు, ఎస్ అండ్ హెచ్ హెచ్ఓడి డాక్టర్ టి.శేఖరంలు పాల్గొన్నారు.

## ధ్యానాంజనేయ స్వామి దేవాలయంలో రాముల వారి అక్షితలకు పూజలు



పూజలు నిర్వహిస్తున్న చైర్మన్ నల్ల రఘుమారెడ్డి సుమిత దంపతులు

**సైదాబాద్, జనవరి 6 ప్రభాతవార్త:** శ్రీ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయానికి అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రచే అందజేయబడిన రాములవారి అక్షితలకు దేవాలయంలో ఆలయ కమిటి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి సుమిత దంపతులు శనివారం ధర్మకర్తలు, అర్చకులతో కలిసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయానికి వచ్చిన భక్తులకు రాముల వారి అక్షితలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు మధుసాగర్, ముద్ద కళ్యాణ్ చక్రవర్తి, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మల్కాజిగిరి డిసిపిగా పద్మజారెడ్డి బాధ్యతలు

**హైదరాబాద్, జనవరి 6 ప్రభాతవార్త :** మల్కాజిగిరి డిసిపిగా పివి పద్మజారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు రాచకొండ సిపి కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పద్మజారెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు చర్యలు తీసుకుంటానని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీసులు ఎల్లవేళలా ముందుంటారని, వారికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. నేరాల నివారణ కోసం రాచకొండ పోలీసులు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన డిసిపి పద్మజారెడ్డిని పలువురు పోలీసు అధికారులు కలిసి సత్కరించారు.

## కేర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స
## స్పృహలో ఉన్న రోగికి మెదడు కణితి తొలగింపు




కోలుకున్న రోగితో కేర్ ఆసుపత్రి వైద్యుల బృందం

**మలక్‌పేట, జనవరి 6 ప్రభాతవార్త :** మలక్‌పేటలోని కేర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. రోగి స్పృహలో ఉండగానే అతడికి శస్త్రచికిత్స చేసి మెదడులోని కణితిని తొలగించారు. శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేర్ ఆసుపత్రి న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ కేవీ శివానంద్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. నిజామాబాద్‌కు చెందిన గిరిధర్ (40) ఇటీవల మూర్ఛవ్యాధితో బాధపడుతూ కేర్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాడు. అతడికి మెదడులో కణితి ఉండటంవల్ల ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. ఇటువంటి వారికి సాధారణ సర్జరి చేస్తే ప్రాణాపాయం ఉండటంతో అతడికి అరుదైన అమ్మిగ్డలో హిప్పో కాంపెక్టమీ అవేక్ క్రేనియటమీ సర్జరి చేయాలని నిర్ధారించారు. రోగికి కౌన్సిలింగ్ ఇచ్చి ఒప్పించారు. ఈ సర్జరీ విధానంలో వైద్యులు ఎనస్థేసియా బృందం రోగిని స్పృహలోనే ఉంచి అతడితో నిరంతరాయంగా మాట్లాడుతూ మెదడులోని కణితిని తొలగించారు. సర్జరి తరువాత నాలుగో రోజు రోగిని డిశ్చార్జ్ చేసారు. కేర్ ఆసువత్రిలో మొదటిసారి చేసిన ఇలాంటి సర్జరి విజయవంతం కావడంతో వైద్యులు హర్షం వ్యక్తం చేసారు. సర్జరీలో భాగస్వాములైన వైద్యుల బృందాన్ని ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కృష్ణమూర్తి అభినందించారు.

## కల్యాణపురిలో కార్పొరేటర్ గీత పర్యటన



కల్యాణపురిలో పర్యటిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 6 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్ డివిజన్ కల్యాణపురి, సీతారామకాలనీలో శనివారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పర్యటించారు. పలుకాలనీలలో కొత్తగా వేయించిన మంచినీటి పైప్‌లైన్ కారణంగా దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి కొత్త రోడ్లు వేయాలని అధికారులను కోరారు. మంచినీటి పైప్‌లైన్ నిర్మాణంలో పలు కాలనీలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని, త్వరలోనే కొత్త రోడ్లు వేయిస్తామని తెలిపారు. కాలనీలో పెండింగ్‌లలో ఉన్న పనులు సకాలంలో పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని, ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. ఈ సందర్భంగా పలు కాలనీ అసోసియేషన్ నేతలతో పలు సమస్యలు చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎఇ రాజ్‌కుమార్, జలమండలి మేనేజర్ అసిఫ్‌అలీ, వర్క్ఇన్‌స్పెక్టర్ కేదార్, కాలనీ సంఘం నేతలు శివరామరాజు, వికాస్, శశి, నీలయిరామ్, కోటి, ప్రేమ్‌రాజ్, శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నేతలు బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, కె.జగన్, రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## యాభై ఏండ్ల వరకు రోడ్లకు, డ్రైనేజీలకు ఇబ్బంది ఉండకుండా పనులు: కార్పొరేటర్ బాలమణి

**సరూర్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 19వ డివిజన్‌లో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి సహకారంతో దాదాపు రూ.2కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేశామని కార్పొరేటర్ బైగళ్ళ బాలమణి తెలిపారు. శనివారం ఆమె అంబేద్కర్‌నగర్ కాలనీలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాలనీలో మరో యాభై ఏండ్ల వరకు ఎలాంటి ఇబ్బందిలేకుండా డ్రైనేజీ, సిసి రోడ్లు చేపట్టామని అన్నారు. అంబేద్కర్ వెల్ఫేర్ భవనం, గాయత్రీనగర్ కాలనీ అసోసియేషన్ భవనపనులు త్వరలో ప్రారంభిస్తామని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి కందాల బాబు, స్థానికులు కాల కుమార్, బాలరాజ్, శ్రీకాంత్, అంబేద్కర్‌నగర్ అధ్యక్షుడు బైగళ్ళ ఓం ప్రకాశ్, స్థానికులు పాల్గొన్నారు.

## దేవాలయం వద్ద షెడ్డు నిర్మాణం ప్రారంభం

**వనస్థలిపురం, జనవరి 6 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ జీఎ1 కాలనీ పద్మావతి కళ్యాణ మండపం వద్ద ఉన్న శ్రీ వైష్ణవి భువనేశ్వరి దేవి దేవాలయం ముందు షెడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి తన పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు మురళికృష్ణ, రమేష్, నీరజ, రామరాజు, సత్యజిత్ కులకర్ణి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బిజేపీ ఆధ్వర్యంలో శ్రీరాముడి అక్షితల వితరణ



మహిళలకు అక్షితలు ఇస్తున్న శారధమల్లేష్, అనిత తధితరులు

**తార్నాక, జనవరి 6 ప్రభాతవార్త:** శాంతినగర్, తార్నాక, విజయపురికాలనీ, లంబాడి బస్తీ, లాలాగూడ ఎస్అండ్‌టీ వర్క్‌షాప్ తధితర ప్రాంతాల్లో అయోధ్య శ్రీరాముడి అక్షతల వితర కార్యక్రమాన్ని బిజేపీ శ్రేణులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజేపీ నేతలతోపాటు శారధమల్లేష్, అనిత పాల్గొన్నారు.

## రామయ్య అక్షితలు తీసుకోవడం అదృష్టం: సిద్దాల

**సరూర్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:** అయోధ్య శ్రీరామ మందిర పూజిత అక్షింతలు తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని రంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు, జిల్లెలగూడ మాజీ ఎంపిటిసి సిద్దాల దశరథ అన్నారు. శనివారం శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ ద్వారా వచ్చిన రాముని అక్షింతలను శ్రీరామ సేవా కార్యకర్తలు ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా దశరథ మాట్లాడుతూ పవిత్రమైన అక్షింతలను పూజా గదిలో పెట్టుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయ కుమార్, వినయ్, సిద్దాల శ్రీనివాస్, వివేక్, సిద్దాల జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ పూజిత అక్షితల వితరణ : కార్పొరేటర్ శ్రావణ్



అయోధ్య శ్రీరామ పూజిత అక్షితలను వితరణ చేస్తున్న కార్పొరేటర్ శ్రావణ్

**నేరెడ్‌మెట్, జనవరి 6 ప్రభాతవార్త:** అయోధ్య శ్రీరామ జన్మపూజిత అక్షితలు 140 డివిజన్ పరిధిలోని కాలనీల్లో ఇంటింటికి తిరిగి అందించాలని కార్పొరేటర్ శ్రావణ్ పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ఆర్.కె నగర్‌లో అయోధ్య శ్రీరామ జన్మపూజిత అక్షితల వితరణ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రావణ్ పాల్గొని ఇంటింటికి తిరిగి వితరణ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ మందిరం స్వాభిమాన సంకేతంగా జనవరి 22న అయోధ్యలో శ్రీరామ భవ్య మందిర ప్రాణప్రతిష్టతో రామరాజ్యం వెలుగొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శివానంద్, దేవదాస్, ప్రభాకర్ శాస్త్రి, రామ్, అనన్య, అనగా, ప్రసాద్, రాజు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు స్వంత నిర్ణయాలు తీసుకోవద్దు : చల్లా

**తుర్కయాంజాల్, జనవరి 6 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ చైర్మన్, మేయర్, కాంగ్రెస్ ఉన్న ప్రాంతంలో కార్పొరేటర్, కౌన్సిలర్ అవిశ్వాసం పెట్టాలంటే ముందుగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డిని సంప్రదించాలన్నారు. స్వంత నిర్ణయం తీసుకుంటే, కౌన్సిలర్, కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీ నుంచి తొలగించబడతారని వారిపై తగిన చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు.



మూసారాంబాగ్ రజక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన అభయహస్తం కార్యక్రమానికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ, మలక్‌పేట్ ఇంచార్జ్ చెకోలేకర్ శ్రీనివాస్ సందర్శించి వచ్చిన వినతులను అడిగి తెలుసుకుని ధరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. (ప్రభాతవార్త, మలక్‌పేట)

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలి : ముఖేష్‌కుమార్



విజేతలతో ముఖేష్‌కుమార్, పాఠశాల డైరెక్టర్లు

**హయత్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:** విద్యార్థులు చిన్నతనంనుంచే చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకుని అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని రాణించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత హాకీ ట్రిపుల్ ఒలంపియన్ ఎన్.ముఖేష్‌కుమార్ సూచించారు. హయత్‌నగర్‌లోని జీ స్కూల్‌లో శనివారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనచేసి పాఠశాలడైరెక్టర్లు అనంతరెడ్డి, నాగేంద్రబాబు, ప్రిన్సిపల్ పూర్ణా శ్రీవాస్తవతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... ప్రతిభ అనేది ఏఒక్కరి సొత్తు కాదని... ఏకాగ్రతతో సాధన చేయడం ద్వారా ఎంతటి కష్టమైన పనిని కూడా సాధించవచ్చన్నారు. చదువు, క్రీడలు రెండింటిపై దృష్టి సారించి ఆయా విభాగాలలో ఉన్నత స్థాయికి చేరేందుకు విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. దీని కోసం పాఠశాలప్రతినిధులు, తల్లిదండ్రులు విద్యార్థులకు సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ... విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలలో క్రీడావిభాగం అధిపతి సుధాకర్ ఆధ్వర్యంలో నర్సరీ నుంచి 12వ తరగతివరకు విద్యార్థులకు ఆయా విభాగాలలో క్రీడా పోటీని నిర్వహించారు. అనంతరం విజేతలకు ముఖేష్‌కుమార్ బహుమతులను అందించారు.

## మినీ శిల్పారామంలో నాట్య ప్రదర్శనలు




భరత నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారిణి సిమ్రాన్

**హైదరాబాద్, జనవరి 6 ప్రభాతవార్త :** మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఆస్ట్రేలియాలో భరతనాట్యంనేర్చుకుంటూ ఉప్పల్ మినీ శిల్పారామంలో కళాకారిణి సిమ్రాన్ ఉదయగిరి నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతో ఆకట్టుకుంది. నృత్య సంస్కార గురువు సాయి లహరి ప్రియ శిష్య బృందం ఆధ్వర్యంలో మూషిక వాహనకౌతం, దశావతార శబ్దం, శ్రీ విఘ్న రాజం భజే, ముద్దుగారే యశోద, కోలాటం, సితాద్రి శిఖరాన తదితర అంశాలన సుష్మ, రిశ్మిత, అక్షిత, దేదీప్య, సునీక్ష, నిత్య తదితరులు తమ ప్రదర్శనలతో ఆహుతులను మెప్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పద్మకల్యాణ్, ప్రతీకౌర్ విచ్చేసి కళాకారులను సత్కరించారు. శనివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

## రోడ్లు నాణ్యంగా వేయాలి: మేయర్ పారిజాత



రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న బడంగ్‌పేట్ మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ పరిధిలోని సాయినగర్ ఫేజ్-1లో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను శనివారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కార్పొరేషన్ డిఇఇ జ్యోతి, ఎఇఇ వినీల్‌గౌడ్, డివిజన్ కార్పొరేటర్ బండారి మనోహర్ తదితరులతో కలిసి రోడ్డు పనులను పర్యవేక్షించి మాట్లాడుతూ రోడ్డును నాణ్యంగా వేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి తనకు ఇవ్వాలి: కీసర యాదిరెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:** 30 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ జెండా మోస్తూ సేవలందిస్తూ విధేయునిగా ఉంటున్న తనకు మీర్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇవ్వాలని పార్టీ సీనియర్ నాయకుడు కీసర యాదిరెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీనే నమ్ముకొని చిత్తశుద్ధితో పని చేయడమే కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశామని తెలిపారు. అదే విధంగా గతంలో వార్డు మెంబర్‌గా గెలిచి ప్రజా సేవ చేశానని, పార్టీకి విధేయునిగా ఉంటూ అంకిత భావంతో పని చేస్తున్న తనను గుర్తించి తనకు కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్ష పదవిలో నియమిస్తే మరింత ఉత్సాహంతో పని చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన పార్టీ అధిష్టానవర్గాన్ని కోరారు.

## రైతులు, వ్యాపారస్తుల సంక్షేమానికి కృషి : చేగూరి



వెంకటరమణకు అభినందనలు తెలుపుతున్న మైల రవికాంత్ తదితరులు

**మలక్‌పేట, జనవరి 6 ప్రభాతవార్త :** రైతులు, వ్యాపారస్తుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలంగాణ ఛాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ పేర్కొన్నారు. ఛాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటరమణను మలక్‌పేట మార్కెట్‌లో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైల రవికాంత్‌ఆధ్వర్యంలో ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ వ్యాపారస్తులందరూ తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నిక చేయడంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు. వ్యాపారస్తులు, రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మైల శ్రీకాంత్, మైల రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## లలితనగర్‌లో రాములవారి అక్షింతల పంపిణీ

**హైదరాబాద్, జనవరి 6 ప్రభాతవార్త :** గడ్డిఅన్నారం శ్రీవేంకట సత్యనారాయణస్వామి దేవాలయం నుంచి లలితానగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికి అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముల వారి అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మార్గం రమేష్, ప్రధానకార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు, వసంత్ మనోహర్, దేవాలయ చైర్మెన్ పూర నరసింహగుప్త, కాలనీ సభ్యులు ఎస్అర్.శ్రీనివాస్, సూర్య ప్రకాష్, ప్రొద్దుటూరి వేణు, చారీ, విజయభాస్కర్, విహెచ్‌పి ఆర్గనైజర్ కల్లెం మధుసుధన్‌రెడ్డి, శ్యామ్‌రాజ్, పాఠక, అనంతచారీ, బిక్షపతి, రాజుగౌడ్, జ్ఞానేశ్వర్, చందు, నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోట్ల విలువ చేసే స్థలాన్ని కాపాడాలి
## కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి : గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి



అక్రమంగా నిర్మిస్తున్న షెడ్ నిర్మాణాన్ని చూపిస్తున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 6 ప్రభాతవార్త :** కోట్లాది రూపాయల విలువచేసే స్థలం కబ్జాకు గురవుతున్న ఎవరూ పట్టించుకోవడంలేదని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో న్యూగడ్డిఅన్నారం కాలనీలోని ప్రధాన రహదారిపై ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతుందని సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గడ్డిఅన్నారం డివిజన్ శివగంగ సినిమా థియేటర్ పక్కనే సరూర్‌నగర్ అలుగు నుండి వచ్చే ఇరిగేషన్ నాలా ఉండేదని, వర్షాకాల సమయంలో సుమారు 10 కాలనీలు నీట మునగకుండా ఈ నాలా ఎంతో ఉపయోగపడే విధంగా ఉండన్నారు. గతంలో భారీ వర్షాలకు గంగా థియేటర్ ప్రహరిగోడ కూలిపోయిందని గుర్తు చేశారు. ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా స్థలాన్ని కాలనీ వాసుల కోసం పార్క్ నిర్మించాలని జి.హెచ్.ఎం.సి అధికారులకు అనేకసార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసిన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం లేదన్నారు. ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్నట్లు సమాచారం అందగానే, కాలనీ వాసులతో పర్యవేక్షించడంజరిగిందని, అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ స్థలంలో కబ్జాదారులు బహిరంగంగా అక్రమ పనులను కొనసాగిస్తూనే ఉన్నారని, కబ్జాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే ప్రభుత్వ స్థలాన్ని కాపాడే విధంగా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలం వద్ద కాలనీవాసులతో పెద్దఎత్తున నిరసన దీక్ష చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రఘురామ్, కాలనీవాసులు యాదయ్య, శ్రీకాంత్, బక్కర్, ధనరాజ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు



దరఖాస్తు పత్రాలను అందజేస్తున్న మైనంపల్లి హన్మంతరావు తదితరులు

**మల్కాజిగిరి, జనవరి 6 ప్రభాతవార్త :** పేద ప్రజల సంక్షేమంకోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ప్రవేశపెట్టిందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ప్రశాంత్‌నగర్, షఫీనగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ప్రజాపాలన కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడుతూ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని అన్నారు. పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు జిఎన్‌వి సతీష్ కుమార్, వెంకటేష్ యాదవ్, చుంకు శ్రీనివాస్, సత్యమూర్తి బికే.శ్రీనివాస్, వినోద్‌యాదవ్, మదర్‌బాయ్, మంద భాస్కర్, జీడి సంపత్‌గౌడ్, నాగరాజు, కన్నా, పార్థు, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటించాలి : కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



సమస్యలపై కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:** భూగర్భ డ్రైనేజీ పనులో లెవెల్స్ సరిగా చూడడంతో పాటు నాణ్యతను పాటించాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని సూర్యనగర్, పరమేశ్వరకాలనీ, శుభోదయ కాలనీల్లో పర్యటించి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీ ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని లేని పక్షంలో వెంటనే తనకు, లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కాలనీల్లో చివరన ఉండే ఇళ్లకు కూడా డ్రైనేజీ కలిపే విధంగా ప్రధాన లైన్లను విస్తరించాలని సూచించారు. అనంతరం ఇన్ఫర్మేషన్‌కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీరోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వివరించారు. జీహెచ్ఎంసీలో నిధుల లేమి కారణంగా కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో పనులు ఆలస్యమవుతున్నాయని కార్పొరేటర్ కాలనీవాసులకు వివరించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజరు రాజు, సూపర్‌వైజర్ బాలునాయక్, ఆయా కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రగతి పథం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం : చిలుక




దరఖాస్తుల తీసుకుంటున్న చిలుక ఉపేందర్ రెడ్డి

**హైదరాబాద్, జనవరి 6 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రగతి పథంలో ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ సౌభాగ్యపురంకాలనీ సంక్షేమ సంఘం భవనంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీ పథకాల దరఖాస్తుల స్వీకరణకు శనివారం చివరిరోజు కావడంతో ఉపేందర్‌రెడ్డి పథకాలకు సంబంధించిన వివరాలను లబ్ధిదారులకు వివరించి దరఖాస్తు ఫారాల్లో వివరాలను నింపి లబ్ధిదారులచేత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులలోపు ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు కార్యాచణ చేపట్టడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సెక్రటరీ నరసింహారెడ్డి, చంద్రశేఖర్, వంగాల శ్రీకాంత్, అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.